క్లుప్తంగా

ఘనంగా కలియుగ వెంకన్న ఆలయ వార్షికోత్సవం



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నరేష్‌కుమార్ దంపతులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలోని కలియుగ వేంటేశ్వర స్వామి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేడీ ఫైనాన్షియల్ అధినేత చల్లపల్లి నరేష్‌కుమార్, అన్నపూర్ణాదేవి దంపతులు వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు మెరుగు నూకరాజు, ప్రధాన కార్యదర్శి పట్టిమీ రాజు, గుంటు నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఐదు వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్‌కు 2, ఇంజినీరింగ్‌కు 1, యూసీడీకి 1, రెవెన్యూ విభాగానికి 1 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2, టీఎస్ఎన్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దనరావు, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, ఈఈ వాటర్ సప్లై సూరిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ మేనిఫెస్టో



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతంపేట: బహుజనుల రాజ్యాధికారమే బహుజన సమాజ్‌పార్టీ మేనిఫెస్టో అని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త, మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రా జిల్లాలు బహుజన జిల్లాలని, రాష్ట్రాన్ని ఏలే రెండు కులాలకు సంబంధం లేని జిల్లాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండుకులాల మధ్య, రెండు పార్టీల మధ్య విపరీతమైన సంఘర్షణ వాతావరణం ఉందని, కొన్ని వేల కోట్లతో రాజకీయ వ్యాపారం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు ఓట్లను ఎలా కోట్లుగా మార్చుకుంటున్నారో బహుజనులు గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీని అభ్యర్థులను బహుజనులంతా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకేరాజారావు, రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, ప్రకాష్, శివప్రసాద్, బోని కృష్ణ పాల్గొన్నారు.

ప్రగతి పథం.. సంక్షేమ రథం



- మారిన 89వ వార్డు స్వరూపం
- కులాలు, మతాలు చూడకుండా సంక్షేమం
- 57 పనులకు రూ.7.73 కోట్లు మంజూరు
- ఇప్పటికే 41 పనులు పూర్తి



చేపల కాలనీలో సామాజిక భవనం అదనపు అంతస్తు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. వార్డులో 57 అభివృద్ధి పనులకు రూ.7.33 కోట్లు మంజూరు అయ్యాయి. వాటిలో 41 పనులు పూర్తి చేశారు. దీంతో వార్డులోని పలు ప్రాంతాల స్వరూపం మారింది. ఆయా ప్రాంతాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రూ.1.70 కోట్లతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం ఇక్కడి ప్రజలకు వరప్రదాయినిగా మారింది. ఈ ప్రాంత వాసులకు వైద్య సేవలకు భరోసా లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఆస్పత్రి లేకపోవడంతో స్థానికులు ఆర్ఎంపీలపై ఆధారపడేవారు. లేకపోతే ఆటోలో గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి వెళ్లాల్సిందే.

అంబులెన్స్ రాని గ్రామంలో ఆస్పత్రి

గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేక అత్యవసరంగా వెళ్లాలంటే అంబులెన్స్ కూడా గ్రామానికి రాలేని పరిస్థితి. గ్రామానికి కొత్తపాలెం రైల్వే అండర్ పాస్‌వే లోపలి నుంచి రావాలి. 108 వాహనం ఇందు లోనుంచి రాలేదు. ఇలాంటి పరిస్థితిలో ఆస్పత్రి నిర్మించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.యూపీహెచ్‌సీలో జనరల్ వైద్యుడు రోజూ అందుబాటులో ఉంటారు. వారంలో ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు సేవలందిస్తున్నారు.

సామాజిక అవసరాలు తీర్చేలా..

ఇక్కడి ప్రజలు ఏ సమావేశం నిర్వహించుకోవాలన్నా.. శుభ కార్యాలు చేసుకోవాలన్నా రోడ్లే వేదికలయ్యేవి. ఆయా ప్రాంతాల ప్రజలు అవసరాలు తీర్చేలా సామాజిక భవనాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సచివాలయం భవనంపై మరో అంతస్తు నిర్మించారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. అలాగే ముస్లిం సామాజిక వర్గానికి, సంతోషనగర్ వాసులకు రూ.20 లక్షలు చొప్పున రెండు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నారు. రజకుల కాలనీలో, యల్లపువానిపాలెంలో రెండు కమ్యూనిటీ హాళ్లకు ఇటీవలే శంకుస్థాపన చేశారు.



కొత్తపాలెంలో నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం

అద్దంలా రహదారులు

యల్లపువానిపాలెం, కొత్తపాలెం, డీఏర్‌నగర్, చంద్రనగర్ ప్రాంతాల్లో నాడు అధ్వానంగా ఉన్న రోడ్లు నేడు అద్దంలా మెరుస్తున్నాయి. సీసీ రోడ్లు బీటీ రోడ్లు వేశారు. వీధుల్లో చిన్నచిన్న పనులు గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో పూర్తి చేశారు. గతంలో కంటే ఈ ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష...

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మొదటి విడతలో నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే రెండో విడతలో మూడు సార్లు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉచిత వైద్యం అందించారు.




చంద్రనగర్‌లో అభివృద్ధి చేసిన రహదారులు

మా రోడ్లు బాగున్నాయి



మా రహదారులు బాగుపడ్డాయి. గతంలో ఈ రోడ్లు అధ్వానంగా ఉండేది. ఈ మధ్య ఆడారి ఆనంద్ కుమార్ మా ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడి రహదారులు చూసి వెంటనే సిమెంట్ రోడ్లు వేయాలని ఆదేశించారు. నెల రోజుల్లోనే ఈ పనులు పూర్తి చేశారు. మా వీధి రోడ్డే కాకుండా ఈ ప్రాంతంలో చాలా రోడ్లు కొత్తగా వేశారు.

– నారిపిన్ని గౌరి, కొత్తపాలెం

అభివృద్ధి పరుగు



89వ వార్డు అభివృద్ధి పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో చాలా పనులు చురుగ్గా సాగుతున్నాయి. వార్డులో మూడు సచివాలయాల పరిధి భీమిలి నియోజకవర్గంలో ఉంది. ఇక్కడ కూడా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ చూపించి పనులు చేస్తున్నారు. అభివృద్ధితో పాటు ఆస్పత్రి నిర్మాణంతో ప్రజలకు ఆరోగ్య భరోసా లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. – **అయితంశెట్టి గోపాలకృష్ణ,** వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు

మానవత్వం చాటుకున్న ఆడారి ఆనంద్‌కుమార్



మూగ విద్యార్థికి తన సొంత నిధులతో పింఛన్ అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం ప్రాంతానికి చెందిన జైపండు అనే 9 ఏళ్ల బాలుడు చెవిటి, మూగ సమస్యతో చిన్న తనం నుంచి బాధపడుతున్నాడు. ఆ బాలుడికి ప్రభుత్వ పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. అయితే సదరం సర్టిఫికెట్‌లో తప్పులు రావడంతో ఈ బాలుడికి పింఛన్ నిలిచిపోయింది. దీంతో ఆ బాలుడి తల్లిదండ్రులు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల సాయంతో సోమవారం ఉదయం ఆడారి ఆనంద్‌కుమార్‌ను పిలకవానిపాలెం వద్ద కలిసి సమస్యను వివరించారు.దీంతో స్పందించిన ఆయన తన సొంత నిధుల నుంచి ఆ బాలుడికి ప్రతి నెలా పింఛన్ ఇస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు ప్రతి నెలా పింఛన్ ఇస్తానని వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి,వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో ఆర్‌వో ప్లాంట్ పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. కోరమాండల్ సంస్థ ఆర్థిక సాయంతో ఈ పనులు చేపడుతున్నారు. కాలుష్య సమస్యకు దగ్గరలో ఉన్న గ్రామాలకు మేలు చేయాలనే ఆలోచనతో కోరమాండల్ సంస్థ ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) రెడ్డిపిల్లి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ లావణ్య,వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలని నిరసన



ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఏసీఈ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు బేసిక్ పే ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని నేవల్ ఆర్మమెంట్ సివిల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియ్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మెయిన్ గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ సీఈ యూనియన్ పాలక వర్గం ప్రాంతాల వారీగా, భాషా బేధాలు చూపిస్తూ రుణాలు మంజూరు చేస్తుందని ఆరోపించారు. సొసైటీ ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. సొసైటీ పాలకవర్గం విధానాల వల్ల ఫిక్సిడ్ డిపాజిట్ దారులంతా భయాందోళనకు గురవుతున్నారన్నారు. సీఈ యూనియన్ ద్వారా నడుస్తున్న కన్స్యూమర్స్ సొసైటీ చెక్ బౌన్స్ కేసుల్లో ఇరుక్కుందని, ఇలాంటి వారి చేతుల్లో సొసైటీ ఉండంతో సభ్యులు, డిపాజిట్ హోల్డర్స్ ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సొసైటీని నిబద్ధతతో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఏసీఈ అండ్ డబ్ల్యూ యూనియన్ సభ్యులు, కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ సారథ్యంలోనే 'నగరాలు'కు గుర్తింపు



సంఘీభావం తెలియజేస్తున్న నగరాల కుల పెద్దలు

మధురవాడ: నగరాల కులానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి, ప్రోత్సహించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని నగర కుల పెద్దలు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రెండు సార్లు చైర్మన్ పదవి మధురవాడ ప్రాంతానికి చెందినవారికి ఇచ్చారన్నారు. తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా బుధవారం మధురవాడ శిల్పారామం జాతరలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. నగరాలను బీసీ ఏలో చేర్చాలని, తమ కులసామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వ ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగర కుల పెద్దలు పోతిన హనుమంతురావు, జగ్గుపిల్లి అప్పలరాజు, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవి, పిళ్లా రమణ, పోతిన సుమన్ వెంకటరావు, నాగోతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

1117వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1117వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ చరిత్రలో ఓ చెరగని అధ్యాయమన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. అమరవీరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు.

7న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. హీరో మోటర్స్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల్లో 140 ఉద్యోగాలకు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ట్రైనీ, జూనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, ప్రొడక్షన్ అసెంబ్లీ, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.10,000 -18,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

వైభవంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు తదితరులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులను అమ్మవారు కంటికి రెప్పలా కాపాడుతుందన్నారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి కాలనీ వాసులంతా ప్రతీ సంవత్సరం కొత్త అమావాస్య పర్వదినాన అమ్మవారి పండగను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల బాబూరావు, సేనాపతి తాతబాబు, వరపల మహేష్, కొట్నాన రవి, యలగాడ రాజు, కుమార్, మహేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పద్మనాభనగర్ అభ్యుదయ యువజన సేవా సంఘం ఎన్నిక



నూతన కమిటీని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో సోమవారం పద్మనాభనగర్ గ్రామ అభ్యుదయ యువజన సేవా సంఘం 35వ వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వ సభ్య సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సేవా సంఘం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ 35 ఏళ్లుగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందిందని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు సంఘం ప్రతిష్టను ఇనుమడించే విధంగా పని చేయాలని కోరారు. ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో 35 వసంతాల ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సాలాపు శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా నందవరపు సోములు, వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడిగా కంపర అప్పారావు, ఉపాధ్యక్షులుగా వల్లూరి జగదీష్, చంద్రశేఖర్, కంచిపాటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్ ప్రసాద్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' కార్యాలయంలో మహిళా దినోత్సవం రేపు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గర్భిణులకు వేద పండితులతో ఆశీర్వచనాలు, నూతన వస్త్రాలు అందిస్తారని తెలిపారు. 14 వార్డుల్లో అత్యుత్తమ సేవలు అందించిన మహిళా శానిటేషన్ సిబ్బందితో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన మహిళా క్రీడాకారులను సత్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్పొరేటర్లు, మహిళా ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



హెచ్ఎస్ఎల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి భద్రతా ప్రమాణాలు పాటించాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్‌ఖత్రి సూచించారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలను సోమవారం సంస్థ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు ముందుగా భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హేమంత్ ఖత్రి మాట్లాడుతూ రోజు వారి జీవితంలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణం ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగులు, కార్మికులు పనిచేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ అంశాలపై చర్చించారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో ప్రమాదరహిత వాతావరణానికి కృషి చేయాలన్నారు. అనంతరం జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ పే సెక్షన్ ఇన్‌చార్జిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాయకులు సోమవారం ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. జీతాల జాప్యం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పే సెక్షన్ ఇన్‌చార్జి రామ్‌ప్రసాద్‌ను కలిసి చర్చించారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, జి.వి.సుబ్బయ్య, ఎస్.ఎ.నాయుడు, బీ.ఎస్.రాజు, పి.వి.నగేష్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్యం తగ్గించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో - వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు చేపడతున్నామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.